# "జీవనప్రభాత్"

శ్రీ కాదంబరి వెంకటేశ్వరరావు

★

"ఛీ...ఛీ...హా...హా...హా...సంఘము...సంఘ...

మట సంఘదౌర్జన్యములా...! యినుపసంకెళ్లా! పాపపంకిల.— దౌర్జన్య...విలాసయుక్తి...హేయ... కలుష...ఆడంబర...స్వార్థపరత్వమైన...యీ సంఘాచారములా!...చట్టుబండలా!...యీ స్వార్థపరులు సంఘ సంస్కర్తలట...హా...హా...హా...ఈ పెద్ద బుర్రలు...దేశోద్ధారకులట...ఒకరిబాగును చూడ జాలని...యీ సంఘమా?...హి...హి...హి...... ఆ...అదిగో...అదిగో నాహృ...ద...యే...శ్వ...రి క...మ...లం...ప్రియభామని రజితకిరణ స్పర్శచే మేల్కొని...అపురూపమైన తన రేఖలు విరజిమ్మి ప్రియుణ్ణి తనివితీర ముద్దాడుటకు ఆయాశపడుతోంది ...హో...ఎంతఘోరం...ఆ పాడు... పయోధరములు ...తమ నల్లటి తెరచే ప్రియుణ్ణి దాచివైచినై...నా కమలం. సుందరనయనాభిరామమైన కమలం, ముడు చుకుపోయింది. ఆ మేఘాలు ఎంతస్వార్థపరమైనవి?... అదిగో ఆ భ్రమరము...ఆచెంపా పుష్పపు మధువును గ్రోలుదామని గంపెడాసతో "ఝుం"కారము చేయు చూ వస్తూంది...ఓరీ కలుషా...ఎంతపని చేసితివి, ప్రచండమైన నీ వాయుప్రవాహంచే ఆ మృదుమధుర మైన, నవనవలాడే కోమల కుసుమాన్ని, నీపొట్ట నెట్టు కున్నావు. పాపం!...ఆతుమ్మెద నిరాశతో తిరిగిపో వలసిందే? ఇదా నీ దేశ సేవ? వాయుదేవుడా... యిదేనా? నీ పరోపకారపారీణత...యింకనూ మూ రెడు బారెడు తోకలవలె బిరుదులు తగిలించుకొని సంఘసంస్కర్తలమనీ, దేశసేవకులమనీ, మీరు ప్రపం చానికి చేసే మోసానికి హద్దుందీ?...ఓయీ బ్రహ్మ... నీసృష్టికాల...నీకు మతి...చెడినదే! ఏమి ఈప్రపంచ సృష్టి? చాలు...చాలు. సెభాస్...నీ తెలివితేటలు. తేగలుతిన్నట్టుగానే వున్నవి......ఆ...ఆ...కమలం ఎక్కడ...వుండు...వస్తున్నా... పోకు... పోకు... ఓరి దుర్మార్గుడా ఆగు. నాకమలాన్ని దొంగిలించకు అది నాజన్మహక్కు. జన్మజన్మాలకు ఆమెయే నా హృదయాధిదేవత. నా కన్నులపండువ...ఖబడ్దార్. జాగ్రత్త...వస్తున్నాను. అక్కడ వదలిపెట్టు నా కమ లాన్ని...ఏమి! వదలవూ...వదలవూ..."

ఆ పిచ్చివాడు అలా ప్రేలుకుంటూ, మా వీధి గుండా పరుగెత్తుకుపోయేడు. ఇతడు విచిత్రమైన పిచ్చి వాడు. చాలారోజులనుంచి యీతన్ని, మావీధిగుండా వెళ్లటం చూస్తున్నా. నేను మాగదిలో కూర్చుని అతని చేష్టలన్నీ కనిపెడుతున్నా. అతని మాటలయందు గొప్ప విశేషముండకపోదు. కొంపముంచి సి. ఐ. డీ. కాదుకదా? పలుకరిద్దామనుకున్నా, కాని మనకెందు కని వూరుకున్నా. అతనికి సుమారు పాతికేళ్ళుంటాయి. ప్రస్ఫుటమైన లలాటం, విశాలమైన వక్షస్థలం, ఆజాను బాహువులు, అన్నీ చూస్తే గొప్ప శూరునివలె వున్నా డు. ఎంతవారికైనా కర్మఫలం అనుభవింపక తప్పు తుందీ! నిరుద్యోగ కీటకానికి గురియై పిచ్చివాడై పోవలేదుకదా! అతనిని చూచినప్పటినుంచీ నాకు అతని యందు ఒకవిధమైన కరుణ కలిగింది. ఓహో...ఒక వేళ...అతడు ఏమైనైన ప్రేమించియుండలేదు కదా? లేకపోతే కమలం ఎవరు? ఆమెగురించి ఎందుకు వాపోవాలి? అతనిప్రతి ఒక్క మాటనుంచీ గూఢమైన భావం పుడుతోంది. యీ సారి అతన్ని పలుకరించి తీరాలి. అతని వృత్తాంతం తెలుసుకుంటేనేకాని, నిద్ర పట్టదు. అనుకుంటూ నాగదిలో కూర్చొని వూహాప్రపం చంలో తేలిపోతున్నాను...... "ఏమండీ మోహన రావుగారూ యీరోజున పార్కులో మీటింగు. ఆరు గంటలు కావస్తోంది. వెళ్లరూ? యిదిగో నోటీసు" అంటూ పద్ధెనిమిదేళ్ళ జవ్వని నాగదిలోకి ప్రవేశిం చింది......"వెడతానమ్మా...ఎందుకు వెళ్లను నీవు కూడా వస్తావా?" అన్నాను. "నావంటి అభాగ్యు రాలికి మీటింగులుకూడా ఎందుకండీ? నా జీవితం అగాధమైన, అనంతమైన నిరాశతో నిండివున్న గాఢాంధకారము. నేను వీధిలోనికివస్తే సంఘం వూరు కుంటుందా?" అంది ఆమె నిరాశాపూరిత హృదయం తో......"అమ్మాయీ నిరాశపడకు. కష్టాలు కలకాల ముండవు. పిచ్చిపిల్లా...యీరోజున పరిహాసంచేసిన సం ఘము రేపు పొగుడుతుంది. యీ మోహనరావున్నంత వరకూ, యీసంఘము మనలనేమియూ చేయజాలదు. ధైర్యము వహింపు."

~ ~ ~

రాత్రి ఎనిమిది గంటల సమయం. నేను మీటిం గునుంచి యింటికి వస్తున్నా. ఎక్కడినుంచో ఆపిచ్చి వాడు నావైపుకే వస్తున్నాడు. యిప్పుడు తప్పక అత నిని పలుకరించి తీరాలి......"ఓయ్ అబ్బీ ఏమోయ్

నిన్నే మాట. యీలారా"... "హి...హి...హి... బాబూ తమరెవరండి? ఆరుస్తారా తీరుస్తారా? వెళ్లండి వెళ్ళండి నేరాను" అన్నాడు నిర్మొగమాటంగా. "అలా కాదోయ్ పిచ్చివాడా, నీతో పని వుంది. యీలారా. చేతనైతే వుపకారం చేస్తాను."......... "ఓహో...యింతకాలానికి నాపాలిటి భగవంతునిలా దొరికేవు. చెప్పండి ఆసంగతేమిటో. ఇదిగో! అయ్యా మరి...ఒక్కటి అడుగుతా. చెపుతారూ?" అంటూ ఒక్క దీర్ఘనిశ్వాసవిడచి చరచరా నావద్దకువచ్చి నిలపడ్డాడు......"ఆ తప్పక నీవడిగింది చెపుతాను. ముందు నీసంగతి చెప్పు. నీవెవ్వరవు? నీదేయూరు? నీసంగతేమిటి? నీకేవూళ్ళో ఎవరైనావున్నారా?"... "అయితే మాకమలం ఎక్కడవుందో చెప్పండి. చెపుతాను. ఆమెను మీరు ఎరుగరూ? ఎర్రగా సన్నగా వుంటుంది."......"ఆసంగతి తర్వాత చెపుతాను. ముందు నీసంగతి చెప్పు. నీకేమీ భయంలేదు నీచరిత్ర వినాలని వుంది. చాలాకాలంనుంచి నీసంగతి చూస్తున్నా. నాచేతనైతే వుపకారం చేస్తాను."......... "వద్దు బాబూ...వద్దు...నాచరిత్ర ఒక విషాదగాథ. అనవసరంగా మీ మనస్సుకూడా బాధ పడుతుంది. పోనీలెండి నాకమలం సంగతి చెప్పొద్దు"......... "చెప్పితీరాలి లేకపోతే యీవాళ నాకు నిద్రపట్టదు. మరేమి భయంలేదు చెప్పు."......"మొత్తానికి మీ పంతం నెగ్గించుకున్నారు. సరే యీకథ యిప్పుడు ముగిసేది కాదు. మహాభారతమంత కథ. రేపు రాత్రి ఝుదేసైటెముకి యీవూరికి వెలుపల తూర్పుదిశనున్న మామిడితోపులోని బంగాళాకు రాండి. నాకథంతా సవిస్తరంగా చెపుతాను. అదే నా నివాసస్థానము" అంటూ రివ్వున అక్కడినుంచి వెళ్ళిపోయినాడు. తర్వాత నేను యింటికివచ్చి యీసంగతంతా యిట్లో వినిపించేను. యీసంగతి వినగానే ఆ అమ్మాయి క్షణకాలం బొమ్మలా నిలబడిపోయింది. తర్వాత యీలా అంది. "అయితే మోహనరావుగారూ ఒకసారి ఆపిచ్చివాణి నాకుకూడా చూపరూ? చూడాలనివుంది. మీరు యీసంగతి చెప్పినప్పటినుండీ నామనస్సు ఎందుకో ఆరాటపడుతోంది. ఒకవేళ అతడు నా చిన్ననాటి స్నేహితుడు కృష్ణమూర్తి కాదుకదా! ఒకసారి అతడు పిచ్చివాడైపోయినాడని విన్నాను. రేపు తప్పక నన్నుకూడా ఆబంగాళాకు తీసుకుపోండి......"ఆలాగే కమలం తొందరపడకు. రేపు యిద్దరం తప్పక వెడతాం. ఏమో భగవంతుని కృపవల్ల అతడే కృష్ణమూర్తియైతే నీ ఆనందానికి హద్దుంటుందా! భగవంతుడు నీమీద చల్లనిచూపులు చూడకూడదూ? నీకు మరల సౌభాగ్యం కలిగే అదృష్టం వుండకూడదూ? అతడే కృష్ణమూర్తియైతే, తప్పక నిన్నాతనికిచ్చి పునర్వివాహం చేస్తాను. నీగురించి ఎంతైనా చేస్తాను. నీ ఆనందమే నా ఆనందము. అప్పుడే నాజీవితం ధన్యం. నా ఉద్యమం సఫలమవుతుంది. నీకు జీవన ప్రభాతమౌతుంది."

~ ~ ~

ఆ మరునాడు ఆపిచ్చివాడు చెప్పినట్టుగానే కమలం నేనూ కలసి కారుమీద వూరువెలుపల మామిడితోపులోవున్న పాడు బంగాళాకు చేరుకున్నాము. ఆపిచ్చివాడు ఒక చింకిచాపమీద పడుకొని కూనిరాగాలు తీస్తున్నాడు. నేను కమలాన్ని బంగాళాకి కాసింత దూరాన కారులో కూర్చోబెట్టి, ఒక్కణ్ణీ మాత్రం బంగాళా జేరుకున్నాను. నన్ను చూడగానే అతడు లేచినిలబడి నమస్కరించి కూర్చోమన్నాడు. నేను కూర్చున్నాను. అతను నాలుగువైపులా చూచి ఒక దీర్ఘనిశ్వాసవిడచి తనచరిత్ర యీవిధంగా చెప్పమొదలెట్టేనాడు.

"యీ చరిత్రంతా జరిగి సుమారు నాలుగు సంవత్సరాలౌతుంది. మానివాసస్థానం గోదావరీ మండలంలోని ఒక పల్లెటూరుగ్రామము. నేను బ్రాహ్మణకుటుంబములో జన్మించినాను. నా పేరు గోపాలక్రిష్ణమూర్తి. మాతండ్రిగారి వృత్తి వ్యవసాయం. మావంశంలో వాళ్లెవరూకూడా ఉద్యోగాల్లో లేరు. కాని బి. ఏ. లు, యం. ఏ. లు ప్యాసయ్యారు. నేనుకూడా బి. ఏ. ప్యాసయ్యాను. మాకు కావల్సినంత సంపత్తియుండుటచే నేను ఉద్యోగప్రయత్నమేమీ చేయలేదు. యిది నా వృత్తాంతము యిక అసలు కథలోకి దిగుదాం. మాకు రెండంతస్తుల పెద్దమేడ వుంది. మాయింటి ప్రక్కనే ఒకవ్రేలు విడచిన మేనమామగారి యిల్లు వుంది. ఆయనకు ముగ్గురు ఆడపిల్లలు, నలుగురు మగపిల్లలు. అప్పటికి యిద్దరి ఆడపిల్లలకు పెళ్ళిఅయి అత్తవారింటికి వెళ్లారు. మూడోపిల్లమాత్రం పెళ్ళియీడులోవుంది. ఆమె పేరు కమలం. పేరుకుతగ్గా అందం కలది, యింకా తామరపువ్వులే ఆమెముందు సరిరావు. ప్రస్ఫుటమైన నుదురు. చారెడేసి కళ్లు; నల్లత్రాచుపామంత తలకట్టు, విశాలమైన వక్షస్థలం, హంసను ధిక్కరించే నడకలు, అవన్నీ యిప్పుడు నాకళ్ళకు కట్టినట్టుగావున్నాయి. ఆపిల్లా

నేనూ బాల్యస్నేహితులం. ఆపిల్లకూ నాకూ, వయస్సులో కేవలం రెండు మూడు సంవత్సరాలు మాత్రం తేడా. యిప్పుడు నే చెపుతోన్న సంగతి మా బాల్యకాలపు నాటిది. ఏఆట ఆడినా ఏపాట పాడినా ఒకర్ని ఒకరు విడిచివుండే వాళ్లముకాము. యిద్దరం ఒకచోట్టే పడుకునేవాళ్ళము. ఒక కంచంలోనే తినేవాళ్ళం. ఒకే తరగతిలో చదువుకున్నాం. సాధారణంగా నేను వాళ్లయింట్లోనే వుంటూవుండేవాడిని. అక్కడే భోజనం చేసేవాడిని. మాయిద్దరి అన్యోన్య ప్రేమచూచి, మా పెద్దవాళ్లు "వీళ్లిద్దరూ దంపతులైతే ఎంతో బాగుంటుంది. యించక్క యిద్దరకూ, యీడూజోడూ సరిపోయింది" అనేవాళ్లు. ఒకరోజున మేము యిద్దరం భోజనంచేస్తున్నాము వాళ్ల నాయనమ్మ యీలా అంది. "ఏమే కమలం క్రిష్ణుడు బావను పెళ్లాడుతావ్ యించక్క మంచి మంచి వస్తువులు చేయించి పెడతాడు..."......"ఊఁ మరి బావ నాకు లోలాకులు చేయించి పెడతాడు కాదు నాయనమ్మా బావనే పెళ్ళాడుతాను. ఏంబావా లోలాకులుచేయించి పెడతావుకాదూ? లోలాకులు కొనిపెడితేనే పెళ్లాడుతాను" అంది. నేను నవ్వుతూ అలాగే అన్నాను.

~ ~ ~

అది వెన్నెలరాత్రి శశాంకుని ధవళకిరణాలు ప్రకృతిని శాంతిరసంలో ముంచివేస్తున్నాయ్. చల్లని సమీరం ప్రాణాలకి హాయినిస్తూవుంది. వేసంగిరోజులు అవటంచేత, చల్లటిగాలికని నేనూ కమలం మా పెరటి దొడ్లో మంచంవేసుకుని పడుకున్నాం. నిద్రపట్టటం లేదు. వినోదానికని పొడుపుకథలు పొడుచుకుంటూ కూర్చున్నాం. కమలం అంది "మరి నేను ఒకకథ పొడుస్తాను చెపుతావు"......"ఆ చెపుతాను"..."చిటారి కొమ్మను మిఠాయిపొట్లము"...... "తేనెపట్టు"... "మీయింటికీ మాయింటికీమధ్య దూలం అడ్డు"...... "ముక్కు"......"నల్లతుమ్మల్లో కర్రెద్దు"...... "పేను"......"యీసారి యిది చెప్పుచూద్దామ్. అవన్నీ చిన్నవి కాబట్టి చెప్పావు." అమారా దేశాన్నుంచి కొమారా పండువచ్చింది కొనేవారేకాని తినేవారు లేరు......"ఓహో పెద్దకథే పొడిచేవు. నీమెళ్లో వున్నదండేమిట్టి? పడం"......"జనకుని కూతురా, దశరథుని కోడలా, కాలుతడవకుండా నూతులో చేద వేయకుండా మంచినీళ్లు పట్టుకురా"......"అబ్బఎంత పెద్ద ప్రశ్న. అదిగో అలాచూడు ఆచెట్టుమీద కాయలు కొబ్బరి."......"దొంగ బావా అన్నీ చెప్పేస్తున్నావా?" అంది వుడుకుమోతుతనంగా. నేను మరింత పరిహాసం చేయటంమొదలెట్టాను......"బావాబావా పన్నీరు, బావనుపట్టుకు తన్నేరు, నులకమంచంవేసారు నూరుగుద్దులు గుద్దేరు, పట్టుమంచం వేసారు, పాతిక గ్రుద్దులు గుద్దేరు," అంటూ నాదవడమీద రెండు తేలికైన లెంపకాయలువేసి మెరపులా మాయమైంది...... "ఆగు ఆగు దొంగపిల్లా అంటూ నేను వెనుక పరుగెత్తాను. యిటువంటి బాల్యక్రీడలతోటి మాబాల్యావస్థ గడచిపోయింది."

~ ~ ~

దినదిన ప్రవర్ధమానంగా శుక్లపక్ష చంద్రునివలె పెద్దవారమగుచూ, పూర్ణిమచంద్రునివలె పూర్ణకళలతో వికసించేము. పద్దెనిమిదేళ్ళ నవయువకుణ్ణి జీవితంలో క్రొత్తక్రొత్తభావాలు పుడుతున్నాయ్. ప్రకృతి అంతా ప్రేమమయంగా తోస్తోంది. ఆమె పదిహేనేళ్ల నవయువతి. ఆరితేరిన అవయవసొంపు ఏర్చికూర్చిన మాటలసొంపు నిగూఢమైన భావాలు కేవలం రతీదేవిలావుంది. మేము మావూరికి నాలుగుమైళ్ళ దూరంలోవున్న హైస్కూల్లో స్కూలుఫైనలు క్లాసు చదువుతున్నామ్. రోజూ ఉదయం యిద్దరం ఒంటెద్దుబండిమీద స్కూలుకివెళ్లి సాయంకాలం యింటికి తిరిగేవాళ్లం. జీవితం అతి సుఖప్రదంగా జరిగిపోతోంది. యిప్పుడు చిన్ననాటి ఆటలంటి ఆటలుకావు యివో రకం ఆటలు. మాకిద్దరకూ స్నేహమెక్కువైనకొలదీ సిగ్గుకూడా ఎక్కువౌతోంది. సాయంకాలం యింటికి తరలేటప్పుడు బండి చేనుగట్లగుండా వచ్చేది. వసంతఋతువు, చెట్లుచిగిర్చి పుడ్పించేయి. పైరుచేలు, నవనవలాడుతూ, కన్నులపండువులా వున్నాయి. చల్లటిపిల్లవాయువులు హాయిగా వీస్తూయుంటే, కోకిల కో, కో, రావాలతోటి, చిలకల కిలకిలారావముల తోటి, గోరువంకల గుణ,గుణ, ధ్వనులతోటి, గుడ్లగూబల కిచ కిచ ధ్వనులతోటి, స్వరాన్ని కలుపుతూ, హాయిగా ప్రకృతిసౌందర్యోపాసన చేసుకుంటూ, ఆనందవిహారాలు చేస్తూయుండేవాళ్లం: అప్పుడప్పుడు అంటూ వుండేవాడిని..."ఏం కమలం ఒకవేళ మీ నాన్న నిన్ను యింకోడికిచ్చి పెళ్ళిచేస్తాడనుకో, అప్పుడు నీవు అత్తారింటికి వెడతావు. నన్ను మరచిపోతావేమో!......"ఎప్పుడూ మరచిపోను, నిన్ను తప్ప యితరులను పెళ్లాడనుగా......" ఆ సంగతి నీవేమి చెప్పగలవు? మీనాన్నకు నిన్ను నాకు యివ్వ

[మిగత 23 వ పేజీలో]

[13 వ పేజీ తరువాయి]

టానికి యిష్టములేకపోవచ్చును. బలవంతంగా యితరుని కిచ్చి పెళ్లిచేస్తాడనుకో అప్పుడేమి చేస్తావు?...... "నేనేమైనా చేతగానిదాననుకున్నావా? మానాన్నగారితోటి నిన్నుతప్ప యితరులను పెళ్లాడనని ఖచ్చితంగా చెప్పేస్తాను. నీవే నాహృదయ పీఠాధిపతివి. ఈహృదయంలో నీకు తప్ప యితరులకు చోటులేదు. యిది నా నిశ్చయం......"అయితే ధన్యుడను. నాబోటి భాగ్యవంతుడు ఈప్రపంచంలో యింకొకడువుంటాడా? అప్పుడు మారాణిగారికి ఏమి పరిహారం అర్పించగలను"......"ఏమి అర్పిస్తారా! మహారాజుగారి ప్రియమైన ప్రేమహారాన్ని"......"నా హృదయలక్ష్మి యిదివరకే అర్పించేను నాప్రేమహారాన్ని, నా హృదయహారాన్నీ, పూర్తిగా నీవశుడనైపోయినాను నీవులేని జగత్తు వికటంగా తోస్తూవుంది. నీవులేనిదే ఒక్కఘడియ ఒక యుగంలా తోస్తుంది. జన్మజన్మాలకైనా నీవే నాహృదయలక్ష్మివి. నా కన్నుల పండువవు. యీరోజు మహానందమైన రోజు" అంటూ ఆమెను నావడిలోనికి తీసుకొని, తేనెకంటె మధురమై ఎర్రగులాబి రేఖలకంటె లేతనైన ఆమె అధరములను తనివితీర చుంచనము చేసాను. అప్పుడు ఒక అజ్ఞాతమైన సిగ్గు ఆవహించింది. శరీరం పులకరించింది. యిప్పటివరకూ కథ బాగా నడచింది. యింకనుంచి ఆమెకూ నాకూ వియోగం ఆరంభమైంది. మాచదువైపోయింది. యిద్దరం స్కూలుఫైనలు ప్యాసయ్యాం. కమలం అంతటితోటి చదువుకి పూర్తిపాఠం చెప్పింది. నేను రాజమహేంద్రవరం ఆర్ట్సుకాలేజీలో "ఇంటరుమీఢియేట్"లో జేరాను.

~ ~ ~

ఆరోజున నేను రాజమండ్రీ ప్రయాణమైవస్తూవుంటే కమలం నన్ను చాలాదూరంవరకూ సాగనంపింది. అప్పుడు ఆమె ముఖం వెలవెలపోయింది. కళ్ళవెంట వియోగాశ్రువులు జలజలరాలినై నేనూహృదయభారాన్ని పట్టలేక "కమలం పాపం చాలాదూరంవచ్చేవు. యింక ఇంటికి వెళ్లు' మరేమీ బెంగపెట్టుకోకు. వారానికి ఒకవుత్తరం వ్రాస్తాను. నీవుకూడా నీ క్షేమసమాచారాలన్నీ వ్రాస్తూయుండు. ఎంత మళ్లీ వేసంగి సెలవుల్లో వచ్చేస్తా" అన్నాను ధైర్యంగా. కాస్తమగవాణి కాబట్టి......"కానీ కృష్ణమూర్తీ నా హృదయమంతా నీమీదే వుంది. నీ వియోగం సహించటం కష్టం పోనీ నన్నుకూడా నీతోవుంచుకో మనమిద్దరం రాజమండ్రీలోనే వుందాం. నేనుకూడా నీతోపాటే చదువుతాను" అంటూ చంటిపిల్లలా కళ్లమ్మట నీళ్లుకార్చటం మొదలెట్టింది. "అలా అనకు కమలం మీనాన్న వప్పుకోడు కాగా నీవు అవివాహితవు. లోకులుచూస్తే ఏమంటారు? నీవూ చదువుకున్నదానివి అన్నీతెలుసు నేను వేరేచెప్పాలా కొద్దికాలం వోపికపట్టు, భగవంతుని కృపవల్ల బి. ఎ. లో ఉత్తీర్ణుడయ్యానంటే, మనమిద్దరం హాయిగా పెళ్లిచేసుకుందాము. అప్పుడు మనం ఎక్కడకు వెళ్ళినా ఫరవాలేదు. ఇదిగో నీకు స్మృతిచిహ్నముగా యీ వుంగరాన్ని నీవద్ద వుంచుకో, నీ వుంగరాన్ని నాకిమ్ము" అంటూ నావుంగరాన్ని ఆమెకిచ్చి ఆమె వుంగరాన్ని నేను పుచ్చుకొని, ఆమెను వూరడించేను. ఆమె వెళ్ళలేక వెళ్లలేక వెనుతిరిగి చూస్తూ వెళ్ళింది. నాకుమాత్రం ఆమెను విడచిరావటం సుతరామూ యిష్టంలేదు. కాని చదువు...

~ ~ ~

రాజమండ్రీ వచ్చేనన్నమాటే కాని, నా మనస్సంతా కమలంమీదే వుండేది. స్నేహితులతోటి ఎక్కడకూ వెళ్లేవాడను కాను, నాటకాలన్నా, సినీమాలన్నా, విరక్తిపుట్టింది. వారంరోజుల కొకసారి కమలానికి వుత్తరాలు వ్రాస్తున్నాను. ఆమెవద్దనుంచి కూడా వుత్తరాలు వస్తున్నాయి......యీలా సంవత్సరం గడచిపోయింది. ఏన్యూలు పరీక్షలు జరిగిపోయినవి. కాలేజీకి సెలవులు యిచ్చివేసినారు. యిక రెండు మూడు రోజులకు మావూరు వెడతాననగా కమలంవద్దనుంచి వుత్తరం వచ్చింది. అందులో యీలా వ్రాసింది.

"ప్రియమైన కృష్ణమూర్తీ,

యిక్కడ నేను క్షేమం. నీ క్షేమసమాచారములు వ్రాయించవలెను. నీవులేనిదే ఒకక్షణం యుగంలావుంది. నీగురించి బెంగపెట్టుకున్నాను. అన్నము హితవగుటలేదు. యీమధ్య మానాన్నగారు నాకు పెండ్లిసంబంధములు చూచుచున్నారు. నేను నిన్నుతప్ప యితరులను పెండ్లాడనని, కచ్చితముగా చెప్పివేసితిని. అందుమీద మానాన్నగారు నామీద కోపపడి "నీయిష్టమే నాయిష్టమైనవాడికిచ్చి పెళ్ళిచేస్తాను" అని కఠినంగా అన్నారు. నాటినుంచీ నాకుచాలా విచారంగావుంది. భగవంతుని కృప ఏలావుంటుందో నిన్ను చూడవలెనని మనస్సు పీకుతోంది. నీవు యీ వుత్తరం చూడగానే బయలుదేరి రావలెను.

ఇట్లు

నీప్రియురాలు "కమలం"

ఆవుత్తరం చూడగానే నాశరీరం కంపించిపోయింది. యిక్కడినుంచి మాకు కష్టాలు ప్రారంభమౌతాయి. మరి రెండురోజులకు మా వూరు చేరుకున్నాను. బాబూ యింక చెప్పలేను. అనవసరంగా మీ మనస్సుకూడా బాధపడుతుంది అంటూ నడుస్తూ నడుస్తూయున్న బండి ఆగిపోయినట్టుగా ఒక్కసారి ఆగిపోయేరు. "అలాకాదు ఆసంగతికూడా చెప్పితీరాలి" అని బలవంతపెట్టేను... "సరి సావధానంగా వినండి" అంటూ పొంగి పొరలివస్తూయున్న కన్నీటిధారలను తుడుచుకుంటూ యీవిధంగా చెప్ప మొదలిడినాడు.

~ ~ ~

అది అరుణోదయకాలం. బాలభానుని రజితకిరణాలు పూలతోటయందలి పుష్పచయములపైపడి బంగారు పూలవలె ప్రకాశిస్తున్నాయ్. మలయానిలము మనస్సుకి హాయినిస్తోంది. ఆ పూలతోటలోని, మల్లె, సంపెంగ, జాజి, విరజాజి, గులాబి,చామంతి మొక్కల నుండి వాసనలు వెదజల్లుతూన్నవి. తుమ్మెదలు పుష్ప మధువును తప్పత్రాగి మత్తెక్కి ఝుంకారములు చేస్తున్నాయ్. కమలం ఒంటరిగా పూలతోటలో విహరిస్తోంది. కోకిలకంఠంతో తన కంఠాన్నికలిపి ప్రణయ రాగాల్ని పాడుతోంది.

"పౌర్ణమీ తిథినాటి చంద్రబింబముచూచి చాలకాలంబాయె.
ఆనాటి ఆటలకు ఆనాటి పాటలకు, అతడొక్కడే సాక్షి.
మనసు మనసూ కలిసె, తనువులేకంబాయె
ప్రణయాంబుధీయందు, దరహాసచంద్రికల నూగులాడేము.
అతడెట్టులోపోయె, చాలాకాలంబాయె చూడగోరెదనిపుడు."

........................

"అబ్బ దొంగా ఎవరువారు. నీవా ప్రియా, వుండూ చిలిపిచేష్టలూ నీవూను...కళ్లు ఏలా నెప్పెట్టినాయో'' అంటూ నాచేతులను వదల్చుకొని కాసింత దూరాన నావైపువాడి చూపులుచూస్తూ నిలబడింది... "క్షమించండి రాణిగారు మీకళ్లు నెప్పెడతాయని అనుకోలేను అపరాధిని శిక్షవిధించండి అనుభవిస్తాను" అంటూ సమీపానికి వెళ్ళి ఆమెను నా కౌగిట్లో యిరికించుకొన్నా......"మహారాజుగారు పోనీలెండి. యీవేళకు క్షమించేను యిది ప్రథమ తప్పుగా భావించేను. లేకపోతేనా మరి......అంటూ తెలికైన లెంపకాయ వేసింది......"ఆసి కొంటెపిల్లా......భగవంతుడుకూడా మాప్రణయాన్ని చూచి ఓర్వలేకపోయాడు. దూరాన్నుంచి యిదంతా కమలంనాన్న చూచేడు. మేము నిశ్చేష్టులమై పోయినాము. మరియింక అక్కడ వుండలేకపోయాము. నాటినుంచీ కమలం నేనూ మళ్లీ కలుసుకోలేదు. మా ఆకాశసౌధాలన్నీ వాయుప్రవాహానికి కొట్టుకుపోయినవి. మాప్రతిజ్ఞలన్నీ భగ్నమైనవి భగవంతుని లీల ఏలా పరిణమించిందో యీలా జరుగుతుందని కలలోనైనా అనుకోలేదు......ఆమెకు సంబంధం స్థిరమైంది. పెళ్లిముహూర్తంకూడా సమీపించింది. నేను అక్కడ వుండలేకపోయేను. యీ అవమానాన్ని భరించటం కష్టం. కాగా నాకు ఆవూళ్లో ఆత్మప్రియులెవరున్నారు. తక్షణం మావూరు వదలిపెట్టివేసినాను. నాటినుంచీ దేశమంతా తిరిగి యీవూరు మద్రాసు జేరుకున్నాను. నేటికి నాల్గు సంవత్సరాలైంది. ఆమె జాడ మళ్లీ తెలియలేదు. ఆమె వియోగంచే బెంగపెట్టుకొని పిచ్చివాడనైపోయాను. ఆమె కనపడితే పిచ్చిపోతుంది. కాని, నాకమలాన్ని నాకు చూపేవారెవరూలేరు. యిది నాసంగతివిన్నావుగదా'' అంటూ ఒక దీర్ఘనిశ్వాస విడచేడు......"బాగుంది నీచరిత్ర, యిప్పుడు కమలాన్ని చూపెడితే నాకేమిస్తావు......"వట్టిది, వట్టిది మీరు చూపించలేరు. ఒకవేళ చూపించితిరా, ఆ జన్మాంతకాలమూ మీకు కృతజ్ఞుడనై యుంటాను" అన్నాడు ఆతురతగా...... "అయితే నాతో రా'' అంటూ అతన్ని నావెంటతీసుకొని కారు సమీపించేము. కారులో కమలం నీ రాక నిరీక్షిస్తోంది......కృష్ణమూర్తీ ఈమెయే నీహృదయలక్ష్మి కమల. సరిగా మూడు సంవత్సరాలనుంచి మాయింట్లో వుంటోంది. పాపం అభాగ్యురాలు ఈమె భర్త చనిపోయినాడు. పునర్వివాహం చేసుకోటానికి వాళ్ళ తల్లితండ్రులు ఒప్పుకోలేదు. ఈమె అక్కడ వుండలేకపోయింది. నీమీద బెంగచే నిన్ను వెదకుచూ, వెదకుచూ, తుదకు నిరాశచెంది యీ వూరు చేరుకుంది. యీమెకు మాయింట్లో ఆశ్రయమిచ్చి కన్నకూతురు కంటె మిన్నగా చూస్తున్నా. మళ్ళీ పెళ్లిచేసుకోమని బలవంత పెట్టినాను కాని. యీమె సమ్మతించలేదు. ఎప్పటికైనా నీవు కనపడుతే, నిన్ను పెండ్లాడుదామని, లేనిచో బ్రతికివున్నంత కాలమూ యీలాగే గడుపుదామని ప్రతిన పట్టింది. నేటికి భగవంతుని కృపవల్ల నీవు లభించేవు. యీమె సౌభాగ్యం తిరిగివచ్చింది. యీమె నిష్కళంక. పవిత్ర హృదయ. యీమెను పరిగ్రహించు, నాకు ఆనందాన్ని చేకూర్చు నా పరిశ్రమ ఫలిస్తుంది......కమలా యితడే నీబాల్య స్నేహితుడు.

క్రిష్ణమూర్తి నీదగ్గరకు వచ్చినాడు పలుకరించు" అన్నాను......"కమలం నీవేనా నాహృదయ లక్ష్మి. ఎన్నాళ్లకు చూచేను. యీకళ్లు కాయలుకాసి పోయినవి. యీమహానుభావుని కృపవల్ల మరల నిన్ను పొందగలిగేను." అంటూ ఆమెను ఒక్కసారి కౌగలించుకొన్నాడు..."కృష్ణమూర్తి అయ్యో ఏలా అయిపోయినావో? అమ్మయ్యో యీసుందర శరీరం ఏలా చిక్కిపోయిందో? యీమోహనరావుగారి మేలు మరువజాలను. యీయన నన్ను కన్నకూతురు కంటే ఎక్కువా చూచేరు. వీరి కృపవల్లే మళ్లీ నిన్ను చూచే భాగ్యం కలిగింది." అంటూ పొంగు పొరలి వస్తూన్న ఆనంద భాష్పాలను పైటుచెంగుతో తుడుచుకొంది... "చాలా రాత్రైంది. యింక ఇంటికి వెళ్లి సావకాశంగా మాట్లాడుకుందాం" అన్నాను. ముగ్గురం కారుమీద యిల్లు చేరుకున్నాం.

~ • ~ • ~

కాలచక్రం ఎవరేలావున్నా తన పనిని తాను నిర్వర్తించు కుంటూనే వుంటుంది. ఒక శుభముహూర్తము చూసి కమలా కృష్ణమూర్తులకు వివాహం చేసివేశాము. పెద్దలందరూ దంపతులను ఆశీర్వదించినారు. ఆసాయంకాలం పార్కులో "సంఘ సంస్కారం" గురించి మీటింగు పెట్టేరు. ఆసభలో శ్రీమతి కమలం ఉపన్యసించింది.

"సోదర సోదరీ మణులారా.

యీరోజున మన మందరం సంఘ సంస్కారం గురించి తర్కించటానికి యిక్కడ సమకూడినాము. ఈరోజున ఈసభలో మీబోటి పెద్దలందరూ వుండగా నాబోటి అనుభవంలేని అబలకు అవకాశం యివ్వటం గొప్ప సుదినం. అందుకు మీకందరకూ నాహృదయపూర్వక వందనాలు. నాగరికత ప్రబలుతూన్న రోజులలో కూడా సంఘ సంస్కారానికి భయపడటం చాలా ఆశ్చర్యకరమైన విషయం. పూర్వకాలపు రోజులు పోయినవి. ఏకాలమున కాకాలమున తగినట్లుగా ప్రవర్తించాలి. జంకు గొంకూ లేకుండా వితంతు వివాహాలు విరివిగా జరిగించాలి. పూర్వాచార పరాయణుల బెదిరింపులకు మనం భయపడవలసిన రోజులు పోయినవి. చాలామంది సంఘ సంస్కర్తలమని పేర్లు పెట్టుకొని ఆరంభ శూరత్వముగా వేదికలపై ఉపన్యాసము లిచ్చి క్రియవచ్చేసరికి, మానాయనమ్మ వితంతు వివాహం చేస్తే నూతులోపడి చస్తానంది." అనే కల్ల బొల్లిమాటలు చెప్పి చల్లగా వూరుకోవటం జరుగుతోంది. పాపం ఎంతమంది వితంతు బాలికలు దుర్భర వైధవ్యపిశాచమునకు గురియై బాధపడుచున్నారో! వారి క్షోభ కేవలం భగవంతునకు తప్ప యితరులకు తెలియదు. అనేక వేదశాస్త్రాలు స్త్రీకి పునర్వివాహం చేయవచ్చునని ఘోషించేయి. కావాలంటే అనేకమంది మహర్షులు చెప్పిన స్మృతులున్నాయి అవన్నీ చెపుతే చాలా గ్రంథం పెరుగుతుంది. తొంభై సంవత్సరాలు గడచి పదిమంది కొడుకులు, పదిమంది కూతుళ్ళ మనమలు, మునిమనమలను ఎత్తిన తాతగారు కూడా పిల్లనిస్తానంటే సిద్ధమౌతూంటే, ఏపాప మెరుగని రూపలావణ్యవతులైన వితంతువులు వివాహమునకు అర్హులు కారా? యిదంతా స్వార్థపరులు పన్నిన పన్నాగం కాకపోతే మరేమిటి? ఏశాస్త్రాలో వుందో తీయండి ఆడదానికి పునర్వివాహం చేయరాదని? ఓ సంఘ సంస్కర్తలారా! ఆడు బిడ్డలగన్న తలిదండ్రులారా నిద్ర నుండి మేల్కొనండి, వితంతు బాలికల నుద్ధరించండి. భారత మహిళాగౌరవాన్ని కాపాడండి. భారత భావి భాగ్యోదయానికి దారితీయండి. మీ ముద్దు పుత్రికలు వైధవ్యాన్ని అనుభవిస్తూ, చూపరులకు ఏవగింపు కొడుతూయుంటే మీ మనస్సు కరుగదా? మీవి రాతి హృదయములా? మీ పుత్రికల సుఖము కోరెదరేని లెండి నడుములు కట్టండి. వితంతు వివాహములు నిర్భయంగా చేస్తామని ప్రమాణం చేయండి. నిజంగా నా దృష్టిలో మోహనరావుగారంత సంఘ సంస్కర్తలు, పరోపకార పారీణులు ఈపట్టణంలో మరియొకరు లేరని తలుస్తాను. యీమహానుభావుని పరిశ్రమవల్లే నేను యీస్థితికి రాగలిగాను. వారికి నాహృదయ పూర్వక వందనములు. ప్రేక్షకులకు శ్రమయిచ్చినందుకు, వందనాలు. నేటికి మాకు "జీవన ప్రభాతమైనది. యింక నేను వుపన్యాసం ముగిస్తానంటూ" కమలంవేదిక దిగింది. "శ్రీమతి కమలాదేవికీ జై. మోహనరావుకూ జై." అనే జయ నినాదాలతోటి సభ ముగిసింది. నాటినుంచీ కమలా కృష్ణమూర్తులు సంఘ సంస్కర్తలై మాయింటి యందేవుండి నాకు కుడిభుజమువలె సహాయం చేస్తున్నారు. యింతతో కథ ముగిసింది. శ్రమయని తలంపక మాకథ నంతా చదివిన చదువరులకు మా హృదయ పూర్వక వందనాలు అర్పిస్తున్నాము. అందుకోనండి. సెలవు...